సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



ఆప్యాయతల 'రక్షాబంధన్'

సోదరి కష్టసుఖాల్లో అనుక్షణం తోడుగా ఉండేందుకు సోదరులకు కట్టే రక్షాబంధన్ పర్వదినం రానే వచ్చేసింది. 8లో▸



అన్ని రంగాల్లో రాణించాలి

బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయ రంగాల్లో రాణించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ అన్నారు. 8లో▸



సీసీ కెమెరాలు తప్పనిసరి

గ్రామాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పెద్దేముల్ ఎస్‌ఐ వేణుకుమార్ సూచించారు. 9లో▸

న్యూస్‌రీల్

ఏ ఒక్క దరఖాస్తూ పెండింగ్‌లో ఉండొద్దు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన దరఖాస్తులను ఆగస్టు 14వ తేదీ నాటికి క్లియర్ చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. గురువారం ధారూరు రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్, డీటీ, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఇచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలన్నారు. ఎవరికీ అన్యాయం జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఏ ఒక్క దరఖాస్తు పెండింగ్‌లో పెట్టరాదని ఆదేశించారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాజిదాబేగం, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐలు స్వప్న, దేవేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌కు స్థలం కేటాయింపు



స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ కిషన్, నాయకులు

దుద్యాల్: మండలంలోని హకీంపేట్‌లో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ కోసం గురువారం తహసీల్దార్ కిషన్ స్థలాన్ని కేటాయించారు. గ్రామ శివారులో సర్వే నంబర్ 256లో 20 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఇక్కడ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నవీన్ కుమార్, ఏపీఎం బందెయ్య, సీసీ సంజీవ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, చాకలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

డీపీఓ జయసుధ



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ జయసుధ

దోమ: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని డీపీఓ జయసుధ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం దోమ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనం, శ్మశానవాటికను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గ్యామా తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ పట్టణ కార్యదర్శిగా తేజ



అనంతగిరి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వికారాబాద్ నగర కమిటీ కార్యదర్శిగా తేజను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా శాఖలకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థి సమస్యలపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

'రైతు బజారు'పాలు

- మార్కెట్లలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ కూరగాయల విక్రయాలు
- తాగునీటికీ తప్పని అవస్థలు
- నాలుగేళ్లుగా పూర్తికాని ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు
- అన్ని మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి



వికారాబాద్ రైతు బజార్‌లో ఎండలో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

వికారాబాద్: రైతు బజార్లలో సమస్యలు తిష్ట వేశాయి. కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే అన్నదాతలు కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. సంతలు, మార్కెట్లు మరీ అధ్వానంగా మారాయి. రైతులతో పాటు కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రం వికారాబాద్‌లోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నా.. కూరగాయల మార్కెట్, రైతు బజార్‌లలో తాగునీటి వసతి కూడా లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇక్కట్ల పాలవుతున్నారు. ఆయా గ్రామాల నుంచి తెల్లవారుజామునే అన్నదాతలు పంట ఉత్పత్తులతో మార్కెట్లకు చేరుకుంటారు. వికారాబాద్‌లోని మహాశక్తి థియేటర్ ముందు ఉన్న మార్కెట్‌కు, రైతు బజార్‌కు, కూరగాయల మార్కెట్‌లో వ్యాపారాలు చేసేందుకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీటన్నింటిలోనూ సమస్యలు తాండవం చేస్తున్నాయి. తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పేరుకే రైతు బజార్లు.. అక్కడ షెడ్లు కూడా లేవని అన్నదాతలు అంటున్నారు రోజంతా ఎండలోనే కూరగాయలు విక్రయించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగిన 'ఇంట్రిగేటెడ్'

గత ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మంజూరు చేసింది. జిల్లాలోని నాలుగు మున్సిపల్ కేంద్రాల్లో నాలుగేళ్ల క్రితం ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. కొన్ని చోట్ల పిల్లర్ దశలో పనులు ఆగిపోగా.. మరి కొన్ని చోట్ల ప్రారంభమే కాలేదు. మరో చోట చేసిన పనులకు బిల్లులు రాక.. వచ్చిన డబ్బులో తమకూ వాటా కావాలని ప్రజా ప్రతినిధులు పేచీ పెట్టడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేసి పారిపోయాడు. వికారాబాద్ పట్టణంలో పిల్లర్ దశలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం రైతులు ఎండలో కూరగాయలు విక్రయిస్తున్నారు. పరిగిలో స్లాబ్ వేసి వదిలేశారు. తాండూరులో పనులు ప్రారంభించి మిన్నకుండిపోయారు. కొడంగల్‌లో ప్రారంభించలేదు.

రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు..

గత ప్రభుత్వం ఒక్కో మున్సిపాలిటీలో రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్లు వెచ్చించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించాలని భావించింది. పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో రెండెకరాల విస్తీర్ణంలో మార్కెట్ నిర్మించాలని నిర్ణయించారు. వికారాబాద్, తాండూరు పట్టణాల్లో జనాభా, అవసరాలను బట్టి ఐదు నుంచి ఆరు ఎకరాల్లో నిర్మించేలా ప్లాన్ చేశారు. నాలుగేళ్ల క్రితం స్థలాలను పరిశీలించి 2021లో టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. ఆ తర్వాత పనులు ప్రారంభమైనా నత్తనడకనే సాగాయి. ఎక్కడా పిల్లర్, స్లాబ్ దశ దాటనేలేదు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను పూర్తి చేయాలని ఆయా ప్రాంతాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.



వికారాబాద్‌లో పునాది స్థాయిలో ఆగిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

భవన లీకేజీలను అరికట్టండి

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను గురువారం కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనశాల, తరగతి గదులను పరిశీలించారు. వర్షాలకు భవనం ఉరుస్తుండటం చూసి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని సూచించారు. అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఎండబ్ల్యూఓ రాజేశ్వరి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్, ప్రిన్సిపాల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

విశ్వనాథం సేవలను మరువలేం

స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, దివంగత నేత విశ్వనాథం పాత్ర మరువలేమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. సర్పంచ్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా ప్రజలకు సేవ చేశారని కొనియాడారు. గురువారం వికారాబాద్‌లోని సత్యభారతి గార్డెన్‌లో విశ్వనాథం ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విశ్వనాథం 103 సంవత్సరాలు జీవించడంతో పాటు మరో 100 సంవత్సరాలు ప్రజలు చెప్పుకునే మంచి పనులు చేశారన్నారు. నాలుగు సార్లు వికారాబాద్ మేజర్ గ్రామ పంచాయతీకి ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యారంటే ఆషామాషీ కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, నాయకులు బస్వరాజు, రాంచంద్రారెడ్డి, సురేష్, రెడ్యానాయక్ తదితరులు పాలొన్నారు.



నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

హామీల అమలుకు పోరాటం

బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి

మాడ్గుల: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని గురువారం మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. మండల కేంద్రంలో భారీ ర్యాలీతో తహసీల్దార్ కార్యాలయాలనికి తరలివెళ్లి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్లు పెంచాలని, రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్లు చెప్పుకొంటుందన్నారు. హామీల అమలుకు ఈ నెల 30 న చలో కొండారెడ్డి పల్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, నాయకులు రామకిషన్, వెంకటేశ్, నర్సింహ, శ్రీను, వెంకన్న, అశోక్, సునీల్, రాజు, భూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలు హరిత వనాలుగా మారాలి

షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవంతో పట్టణాలు పచ్చని వనాలుగా మారాలని సీడీఎంఏ డైరెక్టర్ జోత్స్న అన్నారు. గురువారం మున్సిపల్ పరిధి 10వ వార్డులోని ప్యారడైజ్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ సునీత ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీఎంఏ డైరెక్టర్ జోత్స్న హాజరై మొక్క నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆకుపచ్చ తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పచ్చదనం పెంపొందించాలని కోరారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా.. వాతావరణ సమతుల్యత కాపాడాలన్నా.. మొక్కల పెంపకం అవసరమన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వనమహోత్సవంలో భాగస్వాములై ప్రతి ఇంటికి మొక్క నాటాలని సూచించారు.

ప్రైవేటుకు 'ఇందిరమ్మ' ఇసుక..!

- లబ్ధిదారుల పేరుతో దందా
- కాగ్నా నుంచి భారీగా తరలింపు
- కాసులు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



నావంద్గి ఇసుక రీచ్ వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు

బషీరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక సమస్య ఉండొద్దని భావించిన ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు అక్రమార్కులు లబ్ధిదారుల పేరిట అక్రమ దందా సాగిస్తున్నారు. ప్రైవేటు నిర్మాణాలకు భారీగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని నావంద్గి ఇసుక రీచ్ నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. మంతట్టి నుంచి ఇందర్‌చెడ్ వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర కాగ్నా నదీ పరివాహక ప్రాంతం ఉంది. నావంద్గి వద్ద ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తుంటారు. కొంతమంది వాపారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను రెవెన్యూ కార్యాలయంలో చూపి అనుమతులు పొందుతున్నారు. అనంతరం ప్రైవేటు నిర్మాణాలకు ఇసుక తరలించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. బషీరాబాద్, నావంద్గి, మంతన్‌గౌడ్, కొర్విచెడ్, పర్వత్‌పల్లి, నీళ్లపల్లి, బాబు నాయక్ తండా, అల్లాపూర్, దామర్‌చెడ్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలించాల్సి ఉందని 40 ట్రాక్టర్లకు అనుమతులు తీసుకున్నారు. ఆ పత్రాలు చూపి యథేచ్ఛగా ఇసుక దందా చేస్తున్నారు.

కాగ్నాను తోడేస్తున్న తోడేళ్లు

కాగ్నా పరీవాహక గ్రామాలైన మంతట్టి, కంసాన్‌పల్లి(ఎం), జీవన్గీ, క్యాద్గీరా, గంగ్వార్, ఇందర్‌చెడ్, మైల్వార్, ఎక్మాయి, అల్లాపూర్, దామర్‌చెడ్, కొత్లాపూర్ నుంచి ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవు. కానీ ఈ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. బాద్లాపూర్, కాశీంపూర్, కుప్పన్‌కోట్ గ్రామాలకు, తాండూరు మండలం గోనూరు నుంచి కూడా రాత్రి వేళల్లో దొంగతనంగా ఇసుక రవాణా చేస్తున్నారు.

నిద్దరోతున్న యంత్రాంగం

చీకటి పడగానే కాగ్నాపై ఇసుక తోడేళ్లు పంజా విసురుతున్నాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. పోలీసుల దాడుల్లో ట్రాక్టర్లు పట్టుబడితే రూ.5 వేలు జరిమానా కట్టి మరుసటి రోజు నుంచే మళ్లీ దందా సాగిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేసులు పెడతాం



ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇస్తున్న ఇసుకను ప్రైవేటు అవసరాలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ట్రాక్టర్లను కూడా సీజ్ చేస్తాం. ఇసుక రీచ్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ట్రాక్టర్ డ్రైవర్లు ఇసుక ఎక్కడ డంప్ చేస్తున్నది మాకు తెలియదు. ఎవరికి అనుమతులు ఇచ్చామో వారి ఇళ్లకు ఇసుక చేరిందా లేదా అని పరిశీలిస్తాం. తప్పు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

– షాహెదాబేగం, తహసీల్దార్



అనంతగిరి: వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం



దోమ - ఊటుపల్లి మార్గంలో కూలిన చెట్లు



ధారూరు: చింతకుంట - హరిదాస్‌పల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగు



అనంతగిరి: జైదుపల్లి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

దంచికొట్టిన వాన

విరిగి పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

దోమ: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దోమ - ఊటుపల్లి మార్గంలో చెట్లు విరిగి పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పంచాయతీ కార్యదర్శి రవి జేసీబీ సాయంతో చెట్లను తొలగించారు.

వికారాబాద్‌లో భారీ వర్షం

అనంతగిరి: వికారాబాద్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం పడింది. దీంతో ప్రధాన రోడ్లన్నీ జ లమయంగా మారాయి. పలు చోట్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

ధారూరులో..

ధారూరు: మండలంలో భారీ వర్షం పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పది రోజుల నుంచి వాన జాడ లేక కంది, పత్తి, పెసర, మినుము, మొక్కజొన్న తదితర పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రస్తుత వర్షం పంటలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు. హరిదాస్‌పల్లి, ధారూరు సమీపంలోని వాగులు ఉధృతంగా ప్రవహించాయి.

జోరు వాన

తాండూరు రూరల్: తాండూరు, పెద్దేముల్ మండలాల్లో గురువారం జోరు వర్షం పడింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్తి, కంది పంటలకు ప్రస్తుత వర్షాలు జీవం పోశాయని అన్నదాతలు పేర్కొన్నారు.

శభాష్.. అమృత



అమృతను సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

దుద్యాల్: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జనార్దన్ అన్నారు. ఇటీవల మండలంలోని కుదురుమల్ల గ్రామానికి చెందిన రాసూరి అమృత బీఎస్‌ఎఫ్‌లో చేరడంతో గురువారం ఆమెను స్థానిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సమ్మ, రాములు దంపతులు వారి కూతురు అమృతను దేశ రక్షణ కోసం పంపడం గొప్ప విషయమన్నారు. అనంతరం అమృత మాట్లాడుతూ.. ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాయప్ప, ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీనివాస్, మంజుల, తిరుపతి, శివకుమార్, శ్రీనివాస్, లత, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

42శాతం రిజర్వేషన్ల సాధనకు పోరు

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య



ఢిల్లీలో కొడంగల్‌కు చెందిన బీసీ నాయకులు

దుద్యాల్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన రెండు రోజుల ధర్నా కార్యక్రమానికి కొడంగల్ నియోజకవర్గంలోని బీసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గురువారం ఫోన్‌లో సాక్షితో మాట్లాడారు. రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి రాష్ట్రపతి భవన్ వెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లతో పాటు చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి రాష్ట్రపతి ఆమోదం పొందేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొడంగల్ తాలూకా బీసీ సంఘం అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్, బీసీ సంఘం నాయకులు యాదగిరి, సత్యపాల్, కృష్ణ, మన్సూర్, రాజు, కాశి యాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

దుద్యాల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన రెబ్బని శ్రీకాంత్ తన ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్నారు. దుద్యాల్ మీదుగా హకీంపేట్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మీసేవ నిర్వాహకులపై ఫిర్యాదు

ధారూరు: మండల కేంద్రంలోని మీసేవ నిర్వాహకులు అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని ఓ బాధితుడు గురువారం తహసీల్దార్ సాజిదా బేగంకు ఫిర్యాదు చేశారు. కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేయడానికి వెళితే రూ.45కు బదులు రూ.60 తీసుకుంటున్నారని దోర్నాల్ గ్రామానికి చెందిన మహిపాల్ వాపోయాడు. ఇంతకుముందు కూడా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా నిర్వాహకులను బెదిరించినట్లు చేసి వదిలివేశారని ఆరోపించారు. ప్రస్తుతం కొత్త రేషన్‌కార్డుల కోసం, పాత కార్డుల్లో ఉన్న కొంతమంది పేర్లు తొలగించడానికి వందల సంఖ్యలో వస్తున్నారని, వీరి నుంచి నిత్యం అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ నిర్వహించేందుకు ఆర్‌ఐని పంపిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తెలిపారు.

కలివివనం పాట ఆవిష్కరణ

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలనే కాన్సెప్ట్‌తో తీసిన కలివివనం సినిమా అందరినీ ఆలోచింపజేస్తుందని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, సినీ నటుడు బిత్తిరి సత్తి అన్నారు. పట్టణంలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం సాయంత్రం చేవెళ్ల ప్రాంతానికి చెందిన నిర్మాతలు మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ఏఆర్ క్రియేషన్స్‌పై నిర్మించిన చిత్రంలోని ఓ పాటను ఆవిష్కరించారు. స్థానిక వివేకానంద కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో స్థానిక నాయకులు సీడీని విడుదల చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజేనరేంద్ర, సినిమా హీరోయిన్ నాగదుర్గ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, సీనియర్ నటుడు గాంధీ, చిత్ర యూనిట్ సభ్యులు, చేవెళ్ల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమార్తె వెళ్లిపోయిందని..


మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమార్తె పెళ్లైన వ్యక్తితో వెళ్లిపోవడంతో మనస్తాపానికి లోనైన ఆమె తండ్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంగళరావునగర్‌కు చెందిన జంగిటి రామస్వామి (50) ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండగా అతడి భార్య లక్ష్మి బుద్ధభవన్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో స్వీపర్‌గా పని చేస్తుంది. గత నెల 30న అతడి కుమార్తె పెళ్లైన వ్యక్తితో వెళ్లిపోయింది. దీంతో రామస్వామి రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మనస్తాపానికి లోనైన రామస్వామి బుధవారం రాత్రి భోజనం చేసిన తర్వాత గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. గురువారం ఉదయం లక్ష్మి భర్తను నిద్ర లేపేందుకు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆప్యాయతల 'రక్షాబంధన్'

అక్కాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా రాఖీ పండుగ

సోదరి కష్టసుఖాల్లో అనుక్షణం తోడుగా ఉండేందుకు సోదరులకు కట్టే రక్షాబంధన్ పర్వదినం రానే వచ్చేసింది. అనురాగం, ఆప్యాయతల మేళవింపులో జరుపుకొనే అపూర్వ వేదికకు ప్రతి తోబుట్టువు ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం పర్యావరణ హితంగా పండుగను నిర్వహించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.



వివిధ రకాల డిజైన్ రాఖీలు



కొనుగోలుకు సిద్ధంగా పూసల రాఖీలు

షాబాద్: అక్కాచెల్లెళ్లు.. అన్నాదమ్ములకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకుంటారు.. ఏటా రాఖీ పండుగను ఘనంగా జరుపుకొంటారు.. విదేశాల్లో ఉన్న వారు కూడా రక్షాబంధన్‌కు ఇక్కడికి వచ్చి అన్నాదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపిస్తారు. శనివారం జరుపుకొనే రాఖీ పండుగకు ఆడపడుచులు పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. తల్లిదండ్రుల తర్వాత అనుబంధం, అనురాగం, ఆప్యాయత తోబుట్టువుల మధ్య ఉంటుంది. ఇంటి ఆడపడుచుల సుఖసంతోషాలే తమ సంతోషంగా భావిస్తారు. సోదరులు ఇంతటి విశిష్టమైన అనుబంధానికి ప్రతీకగా, సోదరుల క్షేమం కోరుతూ ఏటా శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున రక్షాబంధన్ నిర్వహిస్తారు.

మొదలైన సందడి

అనుబంధాలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చే హిందూ సంస్కృతిలో రక్షాబంధన్‌కు విశిష్టమైన స్థానం ఉంది. సోదరి, సోదరుల అనురాగానికి చిహ్నంగా ఈ వేడుక జరుపుకొంటారు. ఇళ్లల్లోనే కాకుండా ఆలయాల్లో, సాముహిక వేదికల వద్ద ఈ పర్వదినాన్ని ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకోనున్నారు. బాలికలు, యువతులు, మహిళలు అంతా రాఖీ బంధన్ వేడుకను నిర్వహించేందుకు నాలుగు రోజుల ముందు నుంచే ఆడపడుచులు ఉత్సాహంగా రాఖీలు కొనుగోలు చేయడం మొదలుపెట్టారు.

దీక్ష సంకల్పమే రక్ష

ఏదైనా కార్యక్రమం నిర్వహించ తలపెట్టినప్పుడు రక్షను ధరించడం హైందవ ఆచారం. ఆ కార్యక్రమం ఏ విఘ్నాలు లేకుండా సజావుగా సాగాలని, అనుక్షణం లక్ష్యాన్ని గుర్తు చేసేందుకు ఈ రక్షను ధరిస్తారు. వివాహం, యజ్ఞయాగాదులు, వ్రతాలు, నోములు తదితర కార్యక్రమాల్లో ఈ రక్షా ధారణ తప్పనిసరి. పూర్వకాలంలో యుద్ధానికి వెళ్లే భర్తలకు భార్యలు, సోదరుల క్షేమాన్ని కాంక్షిస్తూ సోదరీమణులు రక్షలు కట్టేవారు. ఆనాటి నుంచి ఆనవాయితీగా ఈ ఆచారం వస్తోంది.

జోరుగా రాఖీల విక్రయాలు

అన్నాచెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ దగ్గర పడుతుండడంతో మండలంలో రాఖీల క్రయ విక్రయాలు జోరందుకున్నాయి. మారుతున్న కాలానికి, అభిరుచులకు అనుగుణంగా, దుకాణదారులు పలు డిజైన్‌లల్లో రాఖీలు అందుబాటులో ఉంచారు.

ప్రకృతి మెచ్చిన 'వృక్షాబంధన్'



చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థులు

కడ్తాల్: ప్రకృతికి మానవాళి రక్షణగా ఉండాలనే గొప్ప సంకల్పంతో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ వినూత్నంగా గత 12 ఏళ్లుగా విద్యార్థులతో కలిసి చెట్లకు రాఖీలు కట్టి వృక్షాబంధన్ నిర్వహిస్తోంది. ప్రకృతికి మానవాళికి మధ్య సైతం అనుబంధం పెంపొందాలనే సదుద్దేశంతో వృక్షాబంధన్ కార్యక్రమం ఏటా దిగ్విజయంగా కొనసాగుతుంది. పిల్లలు, యువకులు, గ్రామస్తులు, విద్యార్థులు అందరి ఆధ్వర్యంలో పర్యావరణ హితంగా 'నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష... మనమంతా భూమాతకు రక్ష' అనే గొప్ప సంకల్పంతో వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహిస్తారు.



చెట్టుకు రాఖీ కడుతున్న చిన్నారులు (ఫైల్)

ఆవు పేడతో రాఖీలు



ఆవు పేడతో తయారు చేసిన రాఖీ



రాఖీని చూపుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలాంటి హాని కలుగచేయని వస్తువులను వినియోగించాలని ప్రకృతి ప్రేమికులు పదే పదే చెబుతుంటారు. ఈ క్రమంలోనే మరో ముందడుగు వేసి ఆవు పేడ, మూత్రంతో ఏకంగా రాఖీలను తయారు చేశారు. పర్యావరణాన్ని రక్షించుటతో హిందూ సంప్రదాయ పండగలు సైతం తమ వంతు పాత్ర పోషిస్తాయనేది సహజసిద్ధంగా తయారు చేసిన రాఖీలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. తాండూరు పట్టణ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొత్రిక విజయలక్ష్మి ఏటా పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతగా ఆవు పేడ, మూత్రంతో తయారు చేసిన రాఖీలను సోదరులకు కట్టాలని ఆమె చెబుతున్నారు. ఈ రాఖీలు తిరిగి భూమిలోకి చేరి మట్టి సారవంతాన్ని పెంపొందిస్తాయంటున్నారు. పరిగి ప్రాంతానికి చెందిన శివరామకృష్ణా చారి అనే వ్యవసాయ విద్య అభ్యసించిన ఓ యువకుడు దీర్ఘాయుష్మ అనే సంస్థను నెలకొల్పి ఆవుపేడ, మూత్రంతో రాఖీలను తయారు చేసి, పర్యావరణ పరిరక్షణపై తన వంతు బాధ్యతను బహిర్గతం చేస్తున్నారు. ఇలాంటి రాఖీలు మార్కెట్‌లో విక్రయానికి సైతం పెట్టడం విశేషం.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



స్వాగత కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఎంజేపీటీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కొడంగల్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని కొడంగల్ ఎంజేపీటీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామ సమీపంలో ఉన్న కొడంగల్ ఎంజేపీటీ కళాశాల, దౌల్తాబాద్ ఎంజేపీటీ పాఠశాలల్లో నిర్వహించిన నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు పొందాలని సూచించారు. గతేడాది ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి వారికి బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్, ఎంజేపీ కొడంగల్ పాఠశాల ప్రిన్సిపాల్ నగేశ్, ఏటీపీ రేఖ్య నాయక్, కాశప్ప, ఉపాధ్యాయులు అనంతరాములు,నరేశ్, విజయ్, కిషన్, అశ్విని, మాణెప్ప, రాధ, రాములు, వెంకటేశ్, అనిల్, నరేందర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇచ్చిన మహిళ కిడ్నాప్

కారులో తీసుకెళ్తుండగా..
మరో కారును ఢీకొన్న వైనం

శంషాబాద్ రూరల్: రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదం ఘటన మహిళ కిడ్నాప్ కథగా మారింది. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల మండలం, ఆలూరు వాసి కొండకల్ల పద్మజ అదే గ్రామానికి చెందిన కమ్మెట విజయ్‌గౌడ్‌కు రూ.నాలుగు లక్షలు అప్పుగా ఇచ్చింది. డబ్బులు తిరిగి ఇచ్చే విషయమై వారి మధ్య గొడవ జరిగింది. దీంతో విజయ్‌గౌడ్ ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో పద్మజ భర్త బుచ్చయ్యను చికిత్స నిమిత్తం మల్కారంలోని ఆశాజ్యోతి ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నెల 5న భర్తకు దుస్తులు ఇచ్చేందుకు వచ్చిన పద్మజను గుర్తించిన విజయ్‌గౌడ్, వెంకటేష్, సాయితో కలిసి ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. కారు కొత్వాల్‌గూడ శివారులో ఔటర్ సర్వీసు రోడ్డులో వెళ్తుండగా.. అదుపుతప్పి ఎదురుగా వచ్చిన బీఎండబ్ల్యూ కారును ఢీకొంది. ఈ ఘటనలో పద్మజ, విజయ్‌గౌడ్, సాయికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రెండు కార్లు ధ్వంసమయ్యాయి. బీఎండబ్ల్యూ కారులో ఉన్న వారు ఆర్జీఐ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఎర్టిగా కారులో ఉన్న పద్మజను విచారించగా.. తనను కిడ్నాప్ చేసినట్లు తెలిపింది. దీంతో శంషాబాద్ పోలీసులు గురువారం ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కత్తి దాడి నిందితుడికి రిమాండ్

మొయినాబాద్: పశువుల మేత విషయంలో గొడవ పడి భార్యాభర్తలపై కత్తితో దాడి చేసిన నిందితున్ని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన హఫీజ్, వా జిద్ ఖురేషీ బుధవారం పశువుల మేత విషయంలో గొడవ పడ్డారు. మాటా మాటా పె రగడంతో హఫీజ్ కత్తితో వాజిద్, అతని భా ర్య రఫియాపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో హఫీజ్‌ను అదుపులోకి తీ సుకుని విచారించా రు. గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించా రు. తీవ్ర గాయాల తో ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న భార్యాభర్తల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

చందానగర్ : రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన వెదురుపాక సంతోష్‌కుమార్ (30) ఇటీవల ఉద్యోగం కోల్పోయాడు. గత కొన్నాళ్లుగా ఉద్యోగం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో మనస్తాపానికి లోనైన అతను గురువారం చందానగర్ నుంచి హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మాదకద్రవ్యాల విక్రేతల అరెస్ట్

66 గ్రాముల హెరాయిన్, బ్రౌన్ షుగర్ స్వాధీనం

చందానగర్: హెరాయిన్, బ్రౌన్ షుగర్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ క్రిష్ణ ప్రియ ఆదేశాల మేరకు శంషాబాద్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో డీటీఎఫ్ పోలీసులు బుధవారం ఖాజాగూడలో హెరాయిన్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన నూర్ అక్తర్, అజిత్ మెమిన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 66 గ్రాముల హెరాయిన్, బ్రౌన్ షుగర్‌తో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీసులు అప్పగించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుళ్లు గణేష్, మల్లేష్, నెహ్రూ, సాయి శంకర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం వికారాబాద్‌లోని సంగం లక్ష్మీబాయి రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు విద్యా బోధన ఎలా చెబుతున్నారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పరిశుభ్రమైన తాగునీటిని వాడాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌పై థర్డ్ డిగ్రీ ఎంటీ?

పోలీస్ కమిషనర్‌పై హెచ్‌ఆర్‌సీ ఆగ్రహం

- ఆగస్టు 12లోగా పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశం

సిటీ కోర్టులు : 17 ఏళ్ల బాలుడిని అక్రమంగా నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడమేమిటని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి సంబంధించిన పూర్తి నివేదికను ఆగస్టు 12లోగా కమిషన్ ముందు ఉంచాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌ను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ ఆదేశించింది. అంతే కాకుండా సీపీ స్వయంగా కమిషన్ ఎదుట హాజరుకావాలని పేర్కొంది. వివరాల్లోకి వెళితే.. దగ్గుపాటి రాంబాబు కుమారుడు దగ్గుపాటి అజిత్ కుమార్ శర్మను (17)ను 2024 డిసెంబర్ 15 నుంచి 17 వరకు జూబ్లీ హిల్స్ పోలీసులు అక్రమంగా నిర్బంధించి, దారుణంగా హింసించారని రాంబాబు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కొట్టడం వల్ల తన కుమారుడు నడవలేనిస్థితిలో ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వీడియో ఆధారాలతో సహా కమిషన్‌ను ఆశ్రయించాడు. దీనిపై గురువారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ విచారణ చేపట్టింది. అయితే గత విచారణ సందర్భంగా ఈ ఘటనకు సంబంధించి జూన్ 30లోగా పూర్తి నివేదికను అందజేయాలని అదే విధంగా థర్డ్ డిగ్రీకి పాల్పడిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీపీకి ఆదేశాలు జారీ చేస్తూ నోటీసులు ఇచ్చింది. అయితే పోలీసులు కమిషన్ ఆదేశాలు పాటించకపోవడమేగాక నివేదికను అందజేయకపోవడంతో మానవహక్కుల కమిషన్ తీవ్రంగా మండి పడింది. ఈ నిర్లక్ష్యానికి నగర పోలీస్ కమిషనర్ బాధ్యత వహిస్తూ పూర్తి స్థాయి నివేదికతో ఈనెల 12లోగా వ్యక్తిగతంగా కమిషన్ ఎదుట హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించింది. అదేవిధంగా బాలుడి ఆరోగ్యపరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తుందని తండ్రి ఆవేదన మేరకు వెంటనే బాలుడిని పరీక్షించి మెరుగైన వైద్య సేవలు అందించాలని నిమ్స్ సూపరింటెండెంట్‌ను కమిషన్ ఆదేశించింది. నిమ్స్‌లో ఇన్ పేషేంట్‌గా బాలుడికి చికిత్స అందించాలని, బాలుడి ఆరోగ్య పరిస్థితిపై 48 గంటల్లోపు వివరణాత్మక నివేదికను అందజేయాలని సూచిస్తూ కమిషన్ తదుపరి విచారణను ఆగస్టు 12కు వాయిదా వేసింది.

బీసీలు అన్ని రంగాల్లో రాణించాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



విఠలయ్యకు నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ తదితరులు

షాబాద్: బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో బీసీసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం బీసీసేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కడుమూరు విఠలయ్య, ఉపాధ్యక్షుడిగా కడుమూరి అశోక్, ప్రధాన కార్యదర్శిగా కావలి రాములు, కోశాధికారిగా కావలి సత్తయ్యలను ఎనుకున్నారు. యువజన కమిటీ అధ్యక్షుడిగా కావలి సందీప్, ప్రధాన కార్యదర్శిగా కడుమూరి ఆనంద్, ఉపాధ్యక్షుడిగా మహేందర్, కార్యదర్శిగా బుగ్గరాములు, కోశాధికారిగా ఉండాల మల్లేష్‌లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. ఆధిపత్య పోరుతోనే బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడుతున్నారని చెప్పారు. అందుకే బీసీలకు అండగా ఆర్.కష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి బీసీలను బలోపేతం చేస్తున్నామన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, మండల అధ్యక్షులు దయాకర్‌చారి, యూత్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మనువాదాన్ని వ్యతిరేకించాలి



సదస్సులో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్

కందుకూరు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళితులపై దాడులు జరుగుతున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా మైనార్టీ వర్గాలపై దాడులకు తెగబడుతుందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో కందుకూరు, మహేశ్వరం, తలకొండపల్లి మండలాలకు సంబంధించిన ప్రజాసంఘాలతో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళిత టీచర్లతో అయ్యప్ప మాల వేసిన విద్యార్థి కాళ్లు మొక్కించి మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. గుడుల్లో దళితులకు ప్రవేశం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ ప్రవేశిస్తే ఆలయాలను శుద్ధి చేస్తున్నారన్నారు. ఇదంతా కేంద్రంలో మోదీ, అమిత్‌షా పాలనతోనే జరుగుతుందని విమర్శించారు. మతోన్మాదానికి, మనువాదానికి వ్యతిరేకంగా ప్రజలందరిని చైతన్య పరచడానికి ఈ నెల 13న ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో జిల్లా సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ హాజరవుతున్నారన్నారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, కేవీపీఎస్ మండలాల కన్వీనర్లు ఏర్పుల శేఖర్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం

ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఏసీపీ రాజు తదితరులు

యాచారం: సీసీ కెమెరాలుంటే పోలీస్ నిఘా ఉన్నట్లేనని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లిలో గురువారం సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, యువకులు సమష్టిగా డబ్బులు జమ చేసి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు జరిగినప్పుడు సులభంగా నేరస్తులను గుర్తించే అవకాశం ఉందన్నారు. సీసీ కెమెరాలుంటే నేరాలు, చోరీలు తగ్గుముఖం పడుతాయన్నారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలు, మరో 20కి పైగా అనుబంధ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతల సహకారం కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ మధు, గ్రామస్తులు శ్రీశైలం, సంతోష, మల్లేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.